# సాక్షి
## జనగామ

గురువారం । 29 । జూన్ । 2023






### త్యాగానికి ప్రతీక బక్రీద్

జిల్లా వ్యాప్తంగా నేడు (గురువారం) బక్రీద్ పండుగను ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు.

- 8లో▸



### కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0°/26.0°

### వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### గోవధ జరగకుండా చూడాలి




చిల్పూరు: గ్రామాల్లో ఎక్కడ గోవధ జరగకుండా చూడాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండాపూర్‌లో బుధవారం దళిత మహిళా గోరక్ష సమితి అధ్యక్షురాలు మోతె విజయరాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతరించి పోతున్న గోవుల సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక జీఓ తేవాలన్నారు. ఈ సమావేశంలో మోతె నర్సయ్య, మంతెన నరేష్ పాల్గొన్నారు.

### కనీస వేతనాలు ఇవ్వాలి



జనగామ రూరల్: ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల్లో స్వీపర్లుగా పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనాలు రూ. 27 అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వ్యాప్త నిరాహార దీక్షల్లో భాగంగా జిల్లా కేంద్రంలో తెలంగాణ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతూ ఏళ్ల తరబడి పాఠశాలల్లో వెట్టి చాకిరి చేస్తున్నా.. ప్రభుత్వాలు స్వీపర్లను పట్టించుకోలేదన్నారు. స్వీపర్ల ఉద్యోగాలను పర్మినెంట్ చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మిట్యా నాయక్, నాగరాజు, దేవదానం, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

### 'కుటుంబ సభ్యులతో రాజకీయం విడ్డూరం'



బచ్చన్నపేట: ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కుటుంబ సభ్యులతో రాజకీయం చేయడం విడ్డూరమని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఈ ప్రాంత పరిస్థితులను చూసి చలించి సీఎం కేసీఆర్ చలువతో గోదావరి జలాలను తెప్పించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను రాజకీయాలకు వాడుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి, సర్పంచ్‌లు మాసపేట రవీందర్ రెడ్డి, కోనేటి స్వామి, నాయకులు వడ్డెపల్లి ఉపేందర్‌రెడ్డి, సిద్దిరాంరెడ్డి, కృష్ణంరాజు, షబ్బీర్, సిద్దారెడ్డి, రాజనర్సు, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, కనుకయ్య, సాయి పాల్గొన్నారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ శివారు హనుమాన్‌పేట సమీపంలో బుధవారం 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెట్రోలింగ్‌లో భాగంగా అటుగా వెళ్తున్న ఓ డీసీఎంను ఆపి తనిఖీ చేయగా అందులో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే డీసీఎం డ్రైవర్‌ను ఆపి విచారించగా రాజపేట మండలం పుట్టగూడెం గ్రామానికి తరలిస్తున్న భూక్యా దేవేందర్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు వెల్లడించారు. చేర్యాల, వీరన్నపేట, చుంచన కోట తదితర గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

### మహిళ ఆత్మహత్య

దేవరుప్పుల: భార్యాభర్తల గొడవతో మనస్తాపం చెందిన భార్య బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బుధవారం రాత్రి సీత్యతండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి సీత్యతండా గ్రామ పంచాయతీకి చెందిన భార్యాభర్తలు గుగులోత్ వీరన్న, సుజాత గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత (43) తాను ఇక బతకనని హెచ్చరిస్తూ ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెంటనే భర్త వెంబడించే క్రమంలో గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వీరన్నకు ఈత రాకపోవడంతో చేసేదిలేక గ్రామస్తులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఎస్సై మునావత్ రమేశ్‌నాయక్ అగ్ని మాపక వాహనాన్ని రప్పించినప్పటికీ బావిలో నీటి సామర్థ్యం ఎక్కువగా ఉండటంతో గాలింపు చర్యలకు అంతరాయం ఏర్పడింది. గ్రామస్తుల సహకారంతో మోటార్లు పెట్టి బావిలోని నీటిని తొలగించే చర్యలు చేపట్టారు.

# యాజమాన్య పద్ధతులే మేలు

## వరిలో తక్కువ సమయంలో కోతకు వచ్చే రకాలు సాగు చేసుకోవాలి

- పత్తికి ఇంకా సమయం ఉంది
- ఆరు తడి పంటలపై దృష్టి సారించాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్




ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న డీఏఓ వినోద్‌కుమార్

జనగామ: పంటలు సాగుచేసే సమయంలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ అన్నారు. జిల్లాలో వానాకాలం సాగు పనులు ఊపందుకున్న నేపథ్యంలో రైతుల సమస్యలు, సందేహాలను నివృత్తి చేసేందుకు 'సాక్షి' ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో డీఏఓ చక్కటి సమాధానాలు చెప్పారు. ఫోన్ ఇన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. 33 మంది రైతులకు పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న, చీడపీడల నివారణ, విత్తనాల్లో రకాలు తదితర వాటి పై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే ఖర్చు తగ్గించుకోవడంతో పాటు దిగుబడులు పెంచుకోవచ్చని సూచించారు.

**ప్రశ్న: వర్షాల ఆలస్యంతో వరిలో సన్న రకాలు వేయవచ్చా?**

– సత్తిరెడ్డి, వెల్ది, పశుల వెంకటేశ్వర్లు, మల్కాపూర్, బూర్ల విష్ణు, శివునిపల్లి, బర్ల శ్రీశైలం, సిరుపురం, ఆముదాల భూపాల్‌రెడ్డి, రాంచంద్రాపురం, శ్రావన్ కుమార్, ఎర్రగొల్లపహాడ్, గంగం బుచ్చిరెడ్డి, కొడవటూరు

జవాబు: 125 నుంచి 130 రోజుల్లో కోతకు వచ్చే వరంగల్-14, హెచ్‌ఎంటీ సోనా, జగిత్యాల-354, జగిత్యాల సన్నాలు, తెలంగాణ సోనా రకానికి చెందిన విత్తనాలు సాగు చేసుకోవచ్చు.

**ప్రశ్న: పత్తి చెట్లు ఎర్రబారి, చచ్చుబడి పోతున్నాయి?**

– జక్కుల లింగయ్య, కిష్టాజీగూడెం

జవాబు: ప్రస్తుతం పత్తి చేనును ఆశించింది పురుగా లేదా ఏదైన వ్యాధి సోకిందా నిర్ధారణ చేసుకోవాలి. స్థానిక వ్యవసాయాధికారికి ఫీల్డ్ విజిట్ చేయాలని సూచిస్తాం. అనంతరం నివారణ చర్యలు తీసుకోవాలి.

**ప్రశ్న: వరి రెండు ఎకరాల్లో ఎర్రగా మారి చచ్చిపోతుంది?**

– జగన్, లింగాలఘనపురం

జవాబు: పొలంలో బుడగలు, పాకురుగా వచ్చినా.. సల్ఫైట్ ఇంజూరీ అంటారు. పంటకు నీరు ఎక్కువగా ఇవ్వొద్దు. నీరు అందిస్తూ.. ఆరబెట్టి, మళ్లీ తడి ఇవ్వాలి. వెంటనే ఎరువులు వేయొద్దు.

**ప్రశ్న: పొలానికి ఎన్నిరోజుల తర్వాత పొటాష్ వేయాలి?**

– ఎండీ.హయాస్, పల్లగుట్ట, చిల్పూరు

జవాబు: వరికి ఎకరానికి 30 కిలోల నుంచి 35 కిలోల వరకు ఒక్క సీజన్‌లో వాడాలి. 15 కిలోల పొటాష్ ఆఖరి దమ్ము చేసే సమయంలో వేయాలి.

**ప్రశ్న: దొడ్డు రకం వరి పంట వేసుకోవచ్చా?**

– సంజీవకుమార్‌రెడ్డి, చాగల్లు, స్టేషన్‌ఘన్‌పూర్

జవాబు: 120 రోజుల సమయంలో కోతకు వచ్చే కూనారం-118, బతుకమ్మ, ఐఆర్-64 రకం విత్తనాలు అనుకూలం. వీటిని సాగు చేసుకోవచ్చు.

**ప్రశ్న: పత్తి ఎకరానికి ఎంత ఎరువు ఎన్ని సార్లు వేయాలి?**

– చిర్ర వీరస్వామి, కుందారం, లింగాలఘనపురం

జవాబు: పత్తి విత్తనాలు వేసుకునే సమయంలో 50 కిలోల డీఏపీ, పక్కన ఎరువు వేయాలి. పైపాటుగా డీఏపీ, కాంప్లెక్స్ వాడొద్దు. 25 నుంచి 30 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి ప్రతీ 20 రోజులకు ఒకసారి నాలుగు సార్లు వేసుకోవాలి.

**ప్రశ్న: 1001 నారు పోసినం, కొనరంటున్నారు?**

– సోమన్న, వల్మిడి,

జవాబు: 1001 కొనరని లేదు. మిల్లర్లు తీసుకోవడానికి వెనకడుగువేస్తున్నారు. ఎటువంటి భయంవద్దు, సాగు చేసుకోండి.

**ప్రశ్న: ఇంకా పత్తి సాగుకు సమయం ఉందా? పత్తిలో గడ్డి వస్తుంది, నివారణ ఏంటీ?**

– కైరిక మల్లయ్య, సాగరం, యాకూబ్, కొడకండ్ల

జవాబు: జూలై 15 నుంచి 20 వరకు పత్తి విత్తులు వేసుకోవచ్చు. ఎకరాకు పావులీటర్ హిట్‌వీడ్, టర్గా సూపర్ 400 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి.

**ప్రశ్న: వానాకాలం సీజన్ పంటల సాగుపై అవగాహన కల్పించాలి?**

– రాపర్తి సోమయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, జఫర్‌గఢ్

జవాబు: ఐదువేల ఎకరాలకు ఒక ఏఈఓ, ఏఓ ఉన్నారు. రైతువేదికల్లో మంగళ, శుక్రవారం రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఆయిల్‌పామ్ సాగుపై కూడా అవగాహన కల్పిస్తున్నాం.

**ప్రశ్న: వర్షాలపై నమ్మకం లేదు, కంది వేసుకోవచ్చా?**

– సందీప్, మస్‌సాన్‌పల్లి

జవాబు: కంది సాగుకు సమయం ఉంది. నిర్భయంగా సాగు చేసుకోవచ్చు.

**ప్రశ్న: వరి కొయ్యలను తగుల బెట్టవచ్చా?**

– కొత్త భాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు, యాదాద్రి భువనగిరి జిల్లా

జవాబు: కలుపు మందు పిచికారీ చేస్తే కుళ్లిపోతుంది. ఒకవేళ ప్రస్తుతం దుక్కిదున్నితే సూపర్ వేస్తే కూడా కుళ్లి పోతుంది.

**ప్రశ్న: రైతు సబ్సిడీతో స్ప్రేయర్లు, పరదాలు ఉన్నాయా?**

– దరావత్ దేవేందర్, బంజెర

జవాబు: ప్రస్తుతం సబ్సిడీ కింద స్ప్రేయర్లు, పరదాలు అందుబాటులో లేవు. ప్రభుత్వం నుంచి వస్తే, వెంటనే రైతులకు సమాచారం అందిస్తాం.

**ప్రశ్న: ఉన్నత వర్గాల రైతాంగానికి రైతుబంధు అవసరమా? పచ్చిరొట్ట ఎరువుల యూనిట్ ఏర్పాటు చేస్తే రైతులకు మేలు, యువతకు ఉపాధి కల్పించవచ్చు?**

– మంతపురి యాదగిరి, కన్నాయపల్లి

జవాబు: పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి జీలుగ విత్తనాలను సబ్సిడీపై అందిస్తున్నాం.

**ప్రశ్న: రైతు నార్లు పోసుకునేందుకు, పత్తి సాగుకు ఇంకా సమయం ఉందా?**

– ఇమ్మడి మధూసూదన్‌రెడ్డి, కేశిరెడ్డిపల్లి, ఎడ్ల శ్రీనివాస్, మరిగడి

జవాబు: జూలై 15 లోపు నార్లు పోసుకోవాలి, తక్కువ సమయంలో కోతకు వచ్చే వాటిని ఎంచుకోవాలి. పత్తి సాగుకు ఇంకా సమయం ఉంది.

**ప్రశ్న: గత వర్షాకాలంలో సౌభాగ్య, ఆమని విత్తనాలు సాగు చేశాం. పొట్టదశలో ఊస తిరుగుతుంది. ప్రత్యామ్నాయంగా వేరే ఉందా?**

– జి.రాజు, స్టేషన్‌ఘన్‌పూర్

జవాబు: ఊస తిరగడం అంటే కాండం తొలిచే పురుగుతో వస్తుంది. నివారణ చర్యలు తీసుకోవాలి. గంట కట్టి, చిరు పొట్టదశకు ముందు తల్లి పురుగు గుడ్లు పెడుతుంది. పొట్టదశకు ముందు ఆకులపై తల్లిపురుగులు గోధుమ రంగులో కనిపిస్తాయి. దానిని గమనించి నివారణ చర్యలు తీసుకుంటే దిగుబడి పెంచుకోవచ్చు.

**ప్రశ్న: వరిలో ఆరుతడి పంట వేసుకోవచ్చా?**

– గంగసాని రాందయాకర్‌రెడ్డి, కుందారం

జవాబు: వరిని ఆరుతడి పంటగా సాగు చేసుకోవచ్చు. విత్తనాన్ని పొడిదుక్కిలో వేసుకోవడం, విత్తనాన్ని నానబెట్టి వెద జల్లే పద్ధతి, డ్రమ్ సీడర్ ఇలా మూడు పద్ధతులు ఉన్నాయి. ఇలా చేస్తే రైతుకు ఎకరాకు రూ.8 నుంచి రూ.10 వేల ఖర్చు తగ్గుతుంది. పొలంలో నీరు నిల్వకుండా, నేల నెర్రలు బారకుండా చూసుకోవాలి.

## పకడ్బందీగా గ్రూప్-4 పరీక్షలు

- జిల్లాలో 29 సెంటర్లు, 10,654 మంది అభ్యర్థులు
- జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలి
- కలెక్టర్ శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: జూలై 1న నిర్వహించే గ్రూప్-4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య తెలిపారు. కలెక్టరేట్ సమావేశం హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు కలెక్టర్లు రోహిత్ సింగ్, ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జనగామలో 14, బచ్చన్నపేటలో 3, లింగాలఘనపురంలో 3, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 7, రఘునాథపల్లిలో 2 మొత్తం 29 సెంటర్లు ఏర్పాటు చేయగా, 10,654 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే లోనికి అనుమతించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎవరైనా షూవేసుకుని వస్తే బయటనే వదిలి లోనికి రావాలని, నడుముకు పెట్టుకునే బెల్ట్‌ను సైతం పరిశీలిస్తామన్నారు. పేపర్-1, 2 ఒకేరోజు రెండు పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుం దన్నారు. హాల్ టికెట్‌లో తప్పులు దొర్లితే, మూడు పాస్‌పొటోలతో గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేయించుకుని, తీసుకు రావాలన్నారు. సెంటర్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష ముగిసే వరకు జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలన్నారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏఓ మన్సూరీ, తహసీల్దార్ రవీందర్, తదితరులు ఉన్నారు.

## ముత్తిరెడ్డి మూడోసారి గెలుపొందాలని..

- బీఆర్‌ఎస్ నాయకుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

జనగామ: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మూడోసారి విజయం సాధించి, మంత్రి పదవి రావాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. జనగామ ఆర్టీసీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం ప్రాంగణం నుంచి యాదగిరిగుట్ట వరకు బుధవారం తలపెట్టిన పాదయాత్రను బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు ప్రారంభించారు. జనగామ, పెంబర్తి, ఆలేరు, వంగపల్లి మీదుగా శ్రీ లక్ష్మి నర్సింహ్మస్వామి కొండ పైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనగామ అభివృద్ధికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అహర్నిషలు పని చేస్తున్నారన్నారు. జనగామ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా వరి దిగుబడి రికార్డులను సృష్టిస్తుందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచుతున్నారన్నారు. పాదయాత్రలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, డాక్టర్ సుల్తాన్ రాజా, మల్లిగారి రాజు, మామిడాల రాజు, మిద్దె పాక లెనిన్, కరె శ్రీనివాస్, ఉడుగుల నరసింహులు, ఉల్లెంగుల రాజు, బక్క లక్ష్మణ్, మంగ రామకృష్ణ, దేవునూరి సతీష్, తిప్పారపు విజయ్, తుంగ సతీష్, జిట్ట శ్రీశైలం, ప్రవీణ్, పసుల ఏబేలు, రావెల రవి, ఉడుగుల నర్సింహులు, సలీం తదితరులు ఉన్నారు.

## వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి, పీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కొమ్మూరి, మానవతారాయ్

జనగామ: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కె.మానవతారాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొమ్మూరి కార్యాలయంలో బుధవారం జరిగిన దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకు వెళ్లాలన్నారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌ను ప్రతి గడపకు తీసుకువెళ్లాలన్నారు. భూసంస్కరణలలో భాగంగా పేదలకు తన భూమిని పంచిన గొప్ప సంస్కర్త పీవీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్దారెడ్డి, గంగం నర్సింహారెడ్డి, చార బుడ్ల దయకర్ రెడ్డి, ఆలేటి సిద్ధిరాములు పోరెడ్డి మల్లారెడ్డి, బనుక శివ రాజ్, అల్లం ప్రదీప్ రెడ్డి, సుంకరి శ్రీనివాస్ రెడ్డి, లింగాల నర్సిరెడ్డి, బచ్చనపేట, వెంకిర్యాల ఎంపీటీసీలు నల్లగోని బాలకిషన్ గౌడ్, పర్శరాములు, కౌన్సిలర్ ముస్త్యాల చందర్, బొట్ల నర్సింగరావు, పిట్టల సతీష్ తదితరులు ఉన్నారు.

## కేసీఆర్ చెప్పడంతోనే.. కౌశిక్ రెచ్చిపోతున్నాడు

- బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



నిడిగొండలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల

రఘునాథపల్లి: సీఎం కేసీఆర్ చెప్పడంతోనే ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్‌లో రెచ్చిపోతున్నాడని ఈటల మండిపడ్డారు. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న రాజేందర్ మార్గమధ్యలో రఘునాథపల్లి మండలం నిడిగొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ముదిరాజ్ నేతలతో సమావేశమయ్యారు. ప్రాణహాని ఉందన్న ఆందోళన నేపథ్యంలో ముదిరాజ్ కులస్తులు ఆయనకు సంఘీభావం తెలిపారు. అనంతరం రాజేందర్ విలేకరులతో మాట్లాడుతూ తన ఓపిక, సహనం, మంచితనాన్ని.. చిల్లరగాళ్లు పరిహాసం చేస్తే సహించమన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మద్దెల సంతోష్, డాక్టర్ మాచర్ల భిక్షపతి, కట్ల సదానందం, పిట్టల కుమార్, తుపాకుల రాములు, మారబోయిన సుధీర్, పిట్టల సురేష్, కుమార్, సుధాకర్, సత్యం, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదుకున్న కొడకండ్లకు అడిగినంత అభివృద్ధి

- సీఎం సహకారంతో అన్ని రంగాల్లో పాలకుర్తి ముందంజ
- మరోసారి గెలిపించే బాధ్యత మీది
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి



గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

కొడకండ్ల: కష్టకాలంలో ఉన్నప్పుడు తనకు అండగా ఉండి కొడకండ్ల ప్రజలు ఆదుకున్నారని, అందుకే అడిగినంత అభివృద్ధి చేస్తున్నానని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించి కొడకండ్ల రూపురేఖలు మారుస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలో రూ.70 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ, రూ.15 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాలను కలెక్టర్ శివలింగయ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.15 లక్షలతో నిర్మించే సిద్ధాంతి నృసింహరామశర్మ స్మారక భవన నిర్మాణానికి, పీరీల కొట్టం నిర్మాణానికి, సెంట్రల్ లైటింగ్ సిస్టంలకు శంకుస్థాపన చేశారు. మాజీ ప్రధాని పి.వి.నర్సింహారావు జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధుసూదన్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ చేనేత కార్మికులతో పాటు ఆ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికుల ఉపాధి కల్పనకు త్వరలో కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు మంత్రి కేటీఆర్‌చే శంకుస్థాపన చేయిస్తానన్నారు. నాడు కరువుకు కేరాఫ్‌గా ఉన్న కొడకండ్ల నేడు కరువుతీరా అభివృద్ధితో కళకళలాడుతోందని, ప్రధాన రోడ్ల అభివృద్ధితో పాటు రూ.6 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేశానని, మరో రూ.5 కోట్లు సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో కొడకండ్లను పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం ఉపాధి కూలీలకు వాటర్ బాటిల్, టిఫిన్ కిట్లు, శిక్షణ పూర్తి చేసుకొన్న మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, మార్కెట్ చైర్మన్ రాము, దేవస్థాన చైర్మన్ రామచంద్రయ్యశర్మ, ఎంపీపీ జ్యోతి, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు విజయలక్ష్మి, నసీరుద్దీన్, రమేష్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కాంగ్రెస్ నాయకులకు మధ్య బుధవారం వాగ్వాదం చోటు చేసుకొంది. మండలకేంద్రంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం మంత్రి కాన్వాయ్ కొడకండ్ల బస్టాండ్ ప్రాంతానికి చేరుకొన్న సమయంలో కాంగ్రెస్ నాయకులు మంత్రికి వినతిపత్రం అందించేందుకు ప్రయత్నించడంతో మంత్రి తన కాన్వాయ్‌ని ఆపారు. మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో హామీలు నెరవేర్చాలంటూ వినతిపత్రం అందించారు. అనంతరం ఏం అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ నాయకులు అనడంతో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఇంకెక్కడైన జరిగిందో చూపించాలని చాలెంజ్ చేస్తూ మంత్రి వెళ్లిపోయారు.

### పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

జనగామ:పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. టీపీఏఆర్ ఏపీ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నిరసన అనంతరం కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టీపీఏఆర్‌ఏ జిల్లా అధ్యక్షుడు ఎర్రోజు రామస్వామి, ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, గౌరవ అధ్యక్షుడు సరాబు వీరన్న, జీపీఏటీఎస్ అధ్యక్షుడు ఇమ్మడి జగ్గారెడ్డి, కార్యదర్శి శంకరయ్య,ధర్మయ్య, సంపత్ కుమార్, భుజంగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేస్తున్న డీపీఓ రంగాచారి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంట పట్టణమైన శివునిపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో రూ.12.78 లక్షలు జీపీ నిధులు దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి బుధవారం గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. గ్రామంలో జియో కంపెనీ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ వేసేందుకు రూ.7 లక్షలతో పాటు వివిధ శాఖల ద్వారా పన్నుల రూపంలో వచ్చిన రూ.4 లక్షల పైచిలుకు మొత్తం రూ.12.78 లక్షలు అప్పటి పంచాయతీ కార్యదర్శి వెంకటకిశోర్ జీపీ ఖాతాలో కాకుండా తన వ్యక్తిగత ఖాతాలో వేసుకున్నాడని, ఈ విషయమై వార్డు సభ్యుడు బూర్ల విష్ణు నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర విజిలెన్స్, పంచాయతీరాజ్ కమిషనర్, కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బుధవారం డీపీఓ అప్పటి శివునిపల్లి ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ కుమారస్వామి, ఈఓ వెంకటకిశోర్ తదితరుల సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శివునిపల్లిలో మొత్తం జీపీ ఆదాయ వ్యయాలకు సంబంధించి రూ.12 లక్షలకు పైగా వెంకటకిశోర్ దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలుస్తుందని, విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డీపీఓ తెలిపారు. ఈ విషయమై వెంకటకిశోర్ మాట్లాడుతూ తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, రికార్డులు లేకపోవడంతో బాధ్యుడిని చేశారన్నారు. ఆడిటర్‌కు ఇచ్చిన రికార్డులు లభిస్తే నిజనిజాలు తెలుస్తాయన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా దూరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

జనగామ రూరల్: సీజన్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా వంటి వ్యాధులు దూరం అవుతాయని సామాజిక వైద్యాధికారి రహమాన్ అన్నారు. బుధవారం జాతీయ మలేరియా మాసోత్సవం సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి దోమల తోనే సంక్రమిస్తుందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించి తగిన సూచనలు, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవిద్య, ఏఎన్‌ఎంలు స్వప్న, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కస్టడీకి రిటైర్డ్ ఎంపీడీఓ హత్య కేసు నిందితులు


జనగామ సబ్ జైలు నుంచి నిందితులను కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ రామ కృష్ణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు గిర బోయిన అంజయ్యతో పాటు శ్రీకాంత్, భాస్కర్‌ను పోలీసులు బుధవారం తమ కస్టడీకి తీసుకున్నారు. వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీషా మెహ్రా నిందితులను రెండు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించిన విషయం తెలిసిందే. 11 రోజులు జనగామ సబ్ జైలులో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు ఉదయం కస్టడీలోకి తీసుకున్నారు. రామకృష్ణయ్య హత్య కేసు విషయంలో రెండు రోజులు విచారణ చేసిన అనంతరం, వీరిని తిరిగి కోర్టుకు అప్పగించాల్సి ఉంటుంది.

### నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ప్రారంభం


ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ వి.రాజేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆర్గానిక్ అండ్ మెడిసినల్ కెమిస్ట్రీ-23 అంశంపై మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ విధానంతో ఆర్గానిక్ మెడిసిన్‌లో నూతన ఆవిష్కరణలకు వేదికగా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో ఇజ్రాయిల్‌కు చెందిన నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అదా యోనాథ్, ప్రొఫెసర్లు డి.బసవయ్య, మహేశ్ లక్ష్మణ్, రామాచారి,పటేల్‌గొహతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజేశ్వర్ రావు దంపతులను ఘనంగా సన్మానించారు.



# త్యాగానికి ప్రతీక బక్రీద్..

దైవాజ్ఞను శిరసావహిస్తూ తన సొంత కుమారుడినే బలి ఇవ్వడానికి సిద్ధమైన తండ్రి.. ఆయన నిర్ణయానికి ఎలాంటి అడ్డు చెప్పకుండాతన ప్రాణం అర్పించడానికి సిద్ధపడిన కుమారుడు.. వీరి భక్తికి ప్రసన్నుడైన దైవం... కత్తిని కుమారుడి గొంతుపై ఎక్కుపెట్టే క్రమంలో ఆయన స్థానంలో దుంబ(గొరెపోతు) ప్రత్యక్షమయ్యేలా చేశారు. దీంతో ఆ రోజును ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ (ఈదుల్ జుహా)పండుగగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం ఉదయం ఈ పండుగ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. త్యాగానికి ప్రతీకైన ఈదుల్ జుహా (బక్రీద్) పర్వదినంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

-హసన్‌పర్తి/ కాజీపేట/ఖిలావరంగల్


ఖిలా వరంగల్ ఈద్గా ప్రాంగణం

- నేడు ఈదుల్ జుహా వేడుకలు
- ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

### ఇబ్రహీంకు అనేక పరీక్షలు..

పూర్వీకుల కథనం ప్రకారం మహ్మద్ ఇబ్రహీం.. దేవుడి (అల్లా) ప్రియమైన భక్తుడు. అతడి భక్తిని పరిశీలించడానికి అల్లా అనేక పరీక్షలు పెట్టాడు. ఓ రోజు దైవం.. ఇబ్రహీం కలలోకి వచ్చి నీ ప్రియమైన కుమారుడు ఇస్మాయిల్‌ను అల్లాకు బలి ఇవ్వాలని ఆజ్ఞాపించాడు. దీనికి ఇబ్రహీం ఏమీ ఆలోచించకుండా భార్యకొడుకును తీసుకుని ఓ నిర్జీవ ప్రదేశానికి బయలుదేరాడు.అయితే మార్గమధ్యలో భార్య ఎక్కడి తీసుకెళ్తున్నారని ప్రశ్నించగా.. ఇది దైవాజ్ఞ అని చెప్పడంతో ఆమె బదులివ్వదు. ఈ క్రమంలో ఇబ్రహీం వెళ్తుండగా సైతాన్ ఆయనను వెంబడిస్తూ నీవు చేయబోతున్న పని మంచిది కాదు.. కలలో వచ్చి కొడుకును బలిఇవ్వమంటే ఇస్తావా..ఇది న్యాయం కాదు.. నీవు చేయబోతుంది పొరపాటని ఇబ్రహీం మనస్సును సైతాన్ పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తుంది. అయినా ఇబ్రహీం ..సైతాన్ మాటలు లెక్కచేయకుండా దైవ కార్యంలో లీనమై ముందుకు సాగాడు. ఇస్మాయిల్‌ను నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లాడు. అయితే గొంతుపై కత్తి ఎక్కిపెట్టడానికి తండ్రి సహసించడని భావించిన ఇస్మాయిల్.. కళ్లకు గంతలు కట్టుకుని బలి ఇవ్వాలని తండ్రిని కోరాడు. కుమారుడు చెప్పిన విధంగా ఇబ్రహీం కత్తితో కుమారుడి గొంతుపై ఎక్కిపెట్టే క్రమంలోనే ఇస్మాయిల్ స్థానంతో దుంబ(గొరెపోతు) ప్రత్యక్షమవుతుంది. ఇబ్రహీం ఆ గొర్రెపోతును జుబహ్ చేశాడని గ్రంథాలు చెబుతున్నాయి.

### ఖుర్బానీ ప్రత్యేకత..

ప్రతి మనిషి తన ప్రాణ రక్షణ కోసం ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీ. దైవాజ్ఞ మేరకు ఇస్మాయిల్‌ను బలి ఇస్తుండగా ఆయన స్థానంలో (గొర్రెపోతు) ప్రత్యక్షమై ఇస్మాయిల్ ప్రాణాలు రక్షిస్తున్నది. ఖుర్బానీ ఇస్తే ప్రాణాలు, ఆస్తులు రక్షించబడుతాయని ఖుర్బాన్‌లో పేర్కొని ఉంది. దీంతో ఏటా బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఖుర్బానీ(బలి) ఇవ్వడం ఆనవాయితీగా మారింది.

### సామూహిక ప్రార్థనలకు సర్వం సిద్ధం

ఈద్గాలో గురువారం ఉదయం 8.30 గంటలకు ఈదుల్ జుహా ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్నాయి. బుధవారం స్థానిక కార్పొరేటర్ సిద్ధం రాజు, ఎమ్మెల్యే నరేందర్ ఈద్గాను సందర్శించారు.బల్దియా ఆధ్వర్యంలో ప్రార్థన స్థలం ముస్తాబు చేశాం. ముస్లింలు సకాలంలో హాజరై ప్రార్థనలు చేయాలి.

ఎంఏ జబ్బార్, ఫోర్ట్‌రోడ్డు ఈద్గా ప్రతినిధి

### ముస్తాబైన ఈద్గాలు, మజీద్‌లు

ఈదుల్ జుహా నమాజ్ కోసం మసీదులు ముస్తాబయ్యాయి. ఆయా ఈద్గాలు, మజీద్‌ల్లో గురువారం ఉదయం 8 గంటల లోపే ప్రత్యేక నమాజ్ పూర్తిచేయనున్నారు. ఈమేరకు ఆయా మజీద్‌ల కమిటీలు ప్రకటనలు కూడా చేశాయి.

### పొట్టేళ్లు రెడీ..


కాజీపేటలో పొట్టేళ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

కాజీపేట: బక్రీద్ పండుగ సందర్భంగా పొట్టేళ్ల విక్రయాలు జోరుగా సాగుతాయి. ఈ పర్వదినం సందర్భంగా ఖుర్బానీ ఇవ్వడం ముస్లింల ఆచారం. ఈ క్రమంలో వరంగల్ నగరంలోని అనేక ప్రాంతాల్లో వారం ముందు నుంచే పొటేళ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పర్వదినానికి శరీరంపై ఎలాంటి గాయాలు లేని పొటేళ్లనే ఎక్కువగా కొనుగోలు చేయడానికి ఇష్టపడుతుంటారు. ధర ఎంతైనా సరే పొటేళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు.

### పొట్టేళ్ల ధర రూ.12వేల వరకు...

బక్రీద్ సందర్భంగా పొట్టేళ్ల ధర రూ.4 నుంచి రూ.12వేల వరకు పలుకుతోంది. ఆరోగ్యంగా, బలంగా ఉన్న పొట్టేళ్లను గొర్రెలకాపరులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. కాగా, బక్రీద్ రోజు దాదాపు వరంగల్ నగరంలో 10వేలకు పైగా పొట్టేళ్లు బలి ఇస్తారని ముస్లింలు చెబుతున్నారు.

# అతివేగంతో అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- కల్వర్టును ఢీకొన్న బైక్.. అక్కడికక్కడే మృతి


సాయికుమార్ మృతదేహం

నర్సంపేట రూరల్ : చివరి సంవత్సరం.. కళాశాలకు చివరి రోజు.. దీంతో ఓ యువకుడు ఉదయమే కాలేజీకి చేరుకున్నాడు. అక్కడ స్నేహితులతో ఆనందంగా గడిపాడు. స్మృతులను నెమరువేసుకుని ఎంజాయ్ చేశాడు. ఫొటోలు దిగిన అనంతరం మిత్రులకు వీడ్కోలు చెప్పాడు. మధ్యాహ్నం వ్యక్తిగత పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై వరంగల్ వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అతివేగంగా ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టును ఢీకొని కాల్వలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన చింతల చెరువు కుంభం సైదులు, ఉమాదేవి దంపతులకు కుమారుడు సాయికిశోర్ (22), కూతురు వైష్ణవి ఉన్నారు. సాయికిశోర్ వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్నాడు. లక్నెపల్లిలో కిరాయికి ఉంటూ రోజూ తన బైక్‌పై కళాశాలకు వెళ్లి వస్తాడు. ఈ క్రమంలో కళాశాలలో చివరి రోజు కావడంతో వైవా పూర్తి చేసుకుని స్నేహితులతో ఆనందంగా గడిపాడు. అనంతరం వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై వరంగల్‌కు వెళ్లి వస్తున్నాడు. అతివేగంగా వస్తూ ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న సూచిక బోర్డుతోపాటు కల్వర్టు ఢీకొని కాల్వలో పడ్డాడు. గమనించిన స్థానికులు 108లో నర్సంపేటకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. దీనిపై సమాచారం అందుకున్న నర్సంపేట రూరల్ ఎస్సై సురేశ్ నాయక్ మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం తరలించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### బైరాన్‌పల్లిలో యువకుడు..


సాయికృష్ణారెడ్డి (ఫైల్)


హసన్‌పర్తి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లికి చెందిన ఇనుగాల సాయి కృష్ణారెడ్డి (23)నగరంలోని ఓమొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం బైక్‌పై బైరాన్‌పల్లి నుంచి హన్మకొండ వైపునకు బయల్దేరాడు. మార్గమధ్యలోని వంగపహాడ్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్.. సాయి కృష్ణారెడ్డి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయి కృష్ణారెడ్డికి తీవ్రగాయాలుకాగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కాగా, మృతదేహాన్ని ఎమ్మెల్యే అరూరి రమేశ్ సందర్శించి నివాళులర్పించారు.ఎమ్మెల్యే వెంట సర్పంచ్ సాంబారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని కారు ఢీకొని మహిళ..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ జాన్‌పాక వద్ద గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైన ఓ మహిళ.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. జాన్‌పాకకు చెందిన శివరాత్రి రాధమ్మ(50) తన పెద్ద కుమారుడు రాజేశ్ ఇంటి నుంచి చిన్న కుమారుడు వినేశ్ ఇంటికి వెళ్లడానికి రాత్రి 10 గంటలకు వరంగల్-నర్సంపేట రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో నర్సంపేట వైపునకు వెళుతున్న గుర్తుతెలియని కారు ఢీకొంది. దీంతో రాధమ్మకు తీవ్రగాయాలు కాగా ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. బుధవారం మృతురాలి కుమారుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

### మద్యానికి బానిసైన తండ్రి..

- మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని
- చికిత్స పొందుతూ మృతి..


భవ్యశ్రీ (ఫైల్)

సంగెం: తండ్రి మద్యం మానడంలేదని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన సంగెం మండలంలోని కుంటపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెండ్లి రసజ్ఞ, రమేశ్ దంపతులకు కూతురు భవ్యశ్రీ(16), కుమారుడు ఉర్జిత్ ఉన్నారు. భవ్యశ్రీ ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. వీరు తమకున్న ఎకరం భూమిలో వ్యవసాయంతో పాటు ఆటో నడుపుకుంటు, ఐనవోలులో హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల మద్యానికి బానిసైన రమేశ్.. నిత్యం భార్యతో గొడవ పడుతున్నాడు. దీంతో భవ్యశ్రీ తండ్రిని అడ్డుకుంటూ గొడవ పడొద్దంటూ వేడుకునేది. ఈ క్రమంలో రమేశ్.. 19వ తేదీన ఉదయం మద్యం సేవించి వచ్చి గొడవ చేస్తున్నాడు. ఇక తన తండ్రి తాగుడు మానడని.. గొడవ తగ్గదని మనస్తాపం చెందిన భవ్యశ్రీ గడ్డి మందు తాగుతుండగా తమ్ముడు ఉర్జిత్ చూసి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంటనే 108లో ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. తల్లి రసజ్ఞ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ యాదగిరి తెలిపారు.

# 'జీనోమ్ ఎడిటింగ్'తో విప్లవాత్మక మార్పులు


కాన్ఫరెన్స్‌కు హాజరైన విదేశీ, స్వదేశీ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

- సైంటిస్టు ఎంజేకే జోన్స్
- కేయూలో రెండో రోజు కొనసాగిన అంతర్జాతీయ కాన్ఫరెన్స్




మాట్లాడుతున్న ప్రొఫెసర్లు ఎంజీకే జోన్స్, శ్రీల మిత్ర,జెన్నిఫర్ అన్నహరిక్రిష్ణ

కేయూ క్యాంపస్ : మొక్కలలో జన్యుసవరణలతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆస్ట్రేలియా ముర్డోక్ వర్సిటీ సైంటిస్టు ఎంజీకే జోన్స్ అన్నారు. కేయూలోని సెనేట్‌హాల్‌లో నిర్వహిస్తున్న ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' పై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో బుధవారం ఆయన ప్రసంగించారు. 'జీనోమ్ ఎడిటింగ్' ద్వారా సృష్టించిన నూతన వంగడాలను, పంటలను ఏఏ దేశాల్లో ఎలా ఉపయోగిస్తున్నారనే అంశంతోపాటు వాటి వినియోగం భవిష్యత్తులో ఎలా ఉంటుందో కూడా వివరించారు. అనంతరం పూణేలోని సావిత్రి బాయి పూలే యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీలమిత్ర .. టమాటా మొక్కల అభివృద్ధిలో వివిధ రకాల ఒత్తిళ్లు, కరువు పరిస్థితులను తట్టుకునేలా ఉండే ప్రయోగాలను వివరించారు, ఓయూ ప్రొఫెసర్ కేవీ రావు.. రసం పీల్చే పురుగులు, క్రిమి కీటకాలను తట్టుకునే పత్తి, వరి పంటల గురించి వివరించారు. భారతీయర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సతీశ్ కుమార్.. ట్రాన్స్‌జీన్ టెక్నాలజీ, పరిశోధన గురించి వివరించారు. మలేషియా మలయా యూనివర్సిటీ ప్రొఫెసర్ జెన్నిఫర్ అన్న హరికిష్ణ.. జీవసాంకేతిక జన్యుసవరణల పరిశోధనల ద్వారా నిలబడే అరటి మొక్కలను గురించి వివరించారు. బెంగళూర్ టీఎఫ్ఆర్ ఎన్‌సీబీసీ శాస్త్రవేత్త పీవీ శివ ప్రసాద్.. ఆహార ఉత్పత్తి పెంచడానికి ఉన్న అవకాశాలు వివరించారు. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్ పి కుమార్ మాట్లాడుతూ పంటల అభివృద్ధికి బయో టెక్నాలజీ పరిష్కారమన్నారు. కార్యక్రమంలో కేయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు ఎస్ రామస్వామి, ఎ సదానందం, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు రోజారాణి, ఎంవీ రాజం, ప్రశాంత మిశ్రా, కోటా శ్రీనివాస్, కేవీ సరిత, రిటైర్డ్ ప్రొఫెసర్లు చేరాలు, మాధురి, కేయూ బయోటెక్నాలజీ విభాగం అధిపతి వెంకటయ్య, ఏవీ రావు, శాస్త్రీ పాల్గొన్నారు.కాగా, అతిథులు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

**ఆకట్టుకున్న పోస్టర్ల ప్రజెంటేషన్స్..**

కేయూలో బయోటెక్నాలజీ విభాగం, యూకే అబెర్విసిత్ వెల్స్ యూనివర్సిటీ కొలబరేషన్‌లో ప్లాంట్ బయోటెక్నాలజీ 'జీనమ్ ఎడిటింగ్' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో పలువురు పరిశోధకులు పోస్టర్లను ప్రజెంటేషన్ చేశారు. జీవసాంకేతిక పరిజ్ఞానంతో నూతన వంగడాలు తదితర అంశాలపై అక్కడికి వచ్చిన పరిశోధకులు, విద్యార్థులకు తెలిపారు. 25 వ రకు పోసర్లు ప్రజెంటేషన్ చేయగా అందులో ప్రతిభ ప్రదర్శించిన వారికి ప్రోత్సాహకంగా ఈనెల 29న ముగింపు సభలో బహుమతులు అందజేస్తారు.

**నేడు ముగియనున్న కాన్ఫరెన్స్**

కేయూలో మూడు రోజుల నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారం సాయంత్రం ముగియనుంది. ఈముగింపు సదస్సుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, కేయూ మాజీ వీసీ విద్యావతి, కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, రాజమండ్రి ఐసీఏఆర్, సీటీఆర్ఐ డైరెక్టర్ శేషుమాధవ్, కేయూ సైన్స్ డీన్ మల్లారెడ్డి, యూజీసీ కోఆర్డినేటర్ మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్ తదితరులు హాజరవుతారు.

# కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు

- పురోగతిలో సహకార సంఘాలు
- రూ.12.92 కోట్ల లాభాల్లో వరంగల్ డీసీసీబీ
- బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్

హన్మకొండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు చెప్పారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వరంగల్ డీసీసీబీ మహాజన సభ నిర్వహించారు. పూర్వ వరంగల్ జిల్లాల్లోని పీఏసీఎస్ చైర్మన్లు, డీసీసీబీలో సభ్యత్వం కలిగిన చేనేత, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు. ముందు డీసీసీబీ ప్రగతిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రవీందర్ రావు మాట్లాడుతూ మీ సేవా కేంద్రాలకు దీటుగా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కామన్ సర్వీస్ సెంటర్‌ల ద్వారా 300 రకాల సేవలు అందించవచ్చన్నారు. ప్రస్తుతం 30 నుంచి 40 రకాల సేవలు అందించేలా రూపకల్పన చేశామన్నారు. వీటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు. పీఏసీఎస్‌లు కేవలం ఎరువుల వ్యాపారం, ధాన్యం కొనుగోళ్లకే పరిమితం కాకుండా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలన్నారు. పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నామన్నారు. వరంగల్ డీసీసీబీ గతేడాది రూ.9 కోట్లలో లాభాల్లో ఉండగా ప్రస్తుతం రూ.12.93 కోట్లకు చేరుకుందన్నారు. ప్రగతిలో రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీ 3వ స్థానానికి చేరుకుందన్నారు. ఈ సందర్భంగా బకాయిలు తీర్చిన 9 పీఏసీఎస్ చైర్మన్‌లను డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, సీఈఓ చిన్నారావు, జిల్లా సహకార అధికారులు సన్మానించారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, జిల్లా సహకార అధికారులు జి.నాగేశ్వర్‌రావు, మద్దిలేటి, సయ్యద్ ఖుర్షీద్, కిరణ్‌కుమార్, డీసీసీబీ జనరల్ మేనేజర్ బి.శ్రీధర్, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటనారాయణ, ఏడీ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# అర్చక సమాఖ్య కృషితోనే వేతనం పెంపు

- రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి


మాట్లాడుతున్న జ్యోతి

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ అర్చక సమాఖ్య కృషితోనే ధూపదీప నైవేద్య అర్చకులు రూ.6వేల నుంచి రూ.10వేల వేతనం పొందుతున్నారని రాష్ట్ర దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కురాకుల జ్యోతి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో వరంగల్‌జోన్‌లోని దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలోని కరీంనగర్, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల 6ఏ, 6బి, 6సీ దేవాలయాలు, ధూపదీప నైవేద్య అర్చకులతో ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్చకులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉందన్నారు. వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు మాట్లాడుతూ దేవాలయాల ఆవరణలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలని అప్పుడే భక్తి భావన కలుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చకసంఘం అధ్యక్షుడిగా నిట్టూరి సతీశ్‌శర్మను ఎన్నుకున్నారు. ఆరు జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు సులోచన, సుప్రియ, చంద్రశేఖర్, సునీత, నవీన్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అర్చక జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, జాక్ కన్వీనర్ డీవీఆర్ శర్మ, సమాఖ్య కార్యదర్శి రత్నాకర్, ఉద్యోగుల సంఘం అర్చకులు కృష్ణమాచారి, రవీంద్రాచారి పాల్గొన్నారు.

**అర్చకులకు అవగాహన సదస్సు..**

వేదపండితులు నాగిళ్ల షణ్ముఖశర్మ, జితేందర్‌శర్మ, సుహాస్‌శర్మ, వజ్రయ్య, సంపత్‌కుమార్‌శర్మ.. 21 కులాలకు చెందిన అర్చకులకు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దేవత విగ్రహాలకు ధూప, దీపాలు, నైవేద్యాలు సమర్పించడం, యాగాలు, పూజలు ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు.

# బీసీల మధ్య చిచ్చుపెడుతున్న ప్రభుత్వం

- మండిపడిన బీసీ సంఘాల నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్, పాల్గొన్న బీసీ నాయకులు

హన్మకొండ : బీసీలకు రూ.లక్ష ఇస్తామంటూ బీసీ కులాల మధ్య ప్రభుత్వం చిచ్చు పెడుతుందని బీసీ సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం రాత్రి హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీల వ్యూహరచన సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు రాజ్యాధికారం దిశగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించి బీసీల రాజకీయ నిర్మాణం అనివార్యమనే నిర్ణయానికి వచ్చి ప్రత్యేక పార్టీ ఏర్పాటు దిశగా ఆలోచించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈదునూరి రాజమొగిళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వరంగల్ పూర్తిగా వెనుకబడిపోయిందని, ఇక్కడ మురికివాడలు పెరిగాయని, పేదలకు నేటికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందలేదని, అట్టడుగు అణగారిన వర్గాలు వరదల్లో చిక్కుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీల రాజకీయ నిర్మాణాన్ని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చేపడుతున్నామన్నారు. వరంగల్‌లో మరోసారి బీసీ ముఖ్య నాయకుల విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో గాజు యుగేందర్ యాదవ్, శ్రీకాంతా చారి, బండారి రవీందర్, బొల్లంపల్లి సారయ్య, తెలంగాణ కొమురయ్య, కేడల ప్రసాద్, పైండ్ల భిక్షపతి, పాదిల రాజు పాల్గొన్నారు.